

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025





జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

● చల్‌గల్‌లో ఏర్పాటుకు నిర్ణయం

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయాన్ని స్థాపించేందుకు ఆమోదం లభించింది. దేశ వ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాలను స్థాపించేందుకు నిర్ణయం తీసుకోగా అందులో జగిత్యాల జిల్లాలో సైతం కేంద్రీయ విద్యాలయం మంజూరు అయిందన్నారు. తెలంగాణలో ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా నాలుగు కొత్తగా కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర క్యాబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు రాష్ట్రంలోని భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రంలో, ములుగు జిల్లా కేంద్రంలో, వనపర్తి జిల్లా నాగవరం శివారులో, జగిత్యాల రూరల్ మండలం చల్గల్‌లో విద్యాలయాలను స్థాపించనున్నారు. మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కేంద్రీయ విద్యాలయం కీలకం కానున్నట్లు కేంద్ర ప్రకటించింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల రూరల్ మండలం చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఆమోదం ఇవ్వడం పట్ల ప్రధానీ నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రి వర్గానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ కృతజ్ఞతలు ప్రకటించారు. అదేవిదంగా కేంద్రీయ విద్యాలయం మంజూరు పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, జగిత్యాల బీజేపీ నియోజకవర్గ నాయకురాలు బోగ శ్రావణి ప్రవీణ్, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్ హర్షం వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలి




ఎమ్మెల్యే సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కోరుట్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో మౌళిక వసతుల కల్పనపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు బుధవారం అఖిలపక్ష నేతలు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌ని కలిసి వినతి పత్రంను అందించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.





మౌలిక వసతులపై నజర్
-2లో..
● గ్రామ పంచాయతీల్లో మొదలైన సర్వే
● రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల తీరుపై సమాచార సేకరణ
● ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న కార్యదర్శులు



మౌలిక వసతులపై నజర్

- గ్రామ పంచాయతీల్లో మొదలైన సర్వే
- రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల తీరుపై సమాచార సేకరణ
- ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న కార్యదర్శులు

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మౌలిక వసతులపై ప్రభుత్వం కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తోంది. సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా పొందుపర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనిపై కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా సర్వే బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గతంలోనే పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల వివరాలను ప్రభుత్వానికి తెలియజేసినా కచ్చితమైన సమాచార సేకరణ కోసం ప్రభుత్వం మరోసారి సర్వే చేపడుతోంది. కార్యదర్శులు ప్రభుత్వం కోరిన సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పంచాయతీ పాలన కోసం తీసుకువచ్చిన పల్లె ప్రగతి యాప్‌లోనే కొత్త ఆప్షన్ ఇచ్చి అప్‌డేట్ చేశారు.



జగిత్యాల మండలం కండ్లపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శి

● కార్యదర్శులకు అవగాహన..

సర్వేపై జిల్లా పంచాయతీ అధికారి అన్ని జీపీల కార్యదర్శులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వివరాలసేకరణపై అవగాహన కల్పించారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివేదికల తయారీ గురించి వివరించారు. సర్వేకు నిర్దిష్టమైన గడువు విధించకపోయినా, సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. యాప్‌లో సమాచారం పొందుపరిచిన తర్వాత ఎంపీడీవోలు, డీపీవో ధ్రువీకరణ అనంతరం నివేదికలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌కు అందించనున్నారు. దీంతో గ్రామ పంచాయతీల ప్రస్తుత స్వరూపం, అందుబాటులో ఉన్న వసతులపై ప్రభుత్వానికి కచ్చితమైన అవగాహన రానుంది.

● పంచాయతీల స్వరూపం తెలిసేలా..

భవిష్యత్తులో పంచాయతీలకు కల్పించాల్సిన వసతుల కోసం నిధుల కేటాయింపు, ఇతర అవసరాలకు సర్వే వివరాలు ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాల తీరు, రోడ్లు, మురుగునీటి కాలువల పరిస్థితి, డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, చెత్త సేకరణ కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రాలీల స్థితిగతులపై అంచనా ఉంటుంది. శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ, పాఠశాల భవనాలకు నిధుల కేటాయింపు, మరుగుదొడ్లు, ప్రహరీలు, తాగునీటి వసతి మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవచ్చు. అదనపు వీధిదీపాల రోడ్డు రవాణావ్యవస్థను, మెరుగుపర్చేందుకు అవకాశం కలుగుతుంది.

● మొదలైన సమాచార సేకరణ

జిల్లాలోని 20 మండలాల పరిధిలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే పంచాయతీల్లో మౌలిక వసతుల పక్కా సమాచారం కోసం సమాచార సేకరణ ప్రక్రియ మొదలైంది. పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు, వ్యవసాయ సంఘం పశువైద్య ఉపకేంద్రాలు, పాఠశాల భవనాలు, పల్లెప్రకృతివనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, వీధిదీపాలు, కుళాయిలు, బోర్లు, డ్రైనేజీలు, లింకురోడ్లు, ఇంకుడు గుంతలు, ట్రాక్టర్ ట్రాలీలు, రైతువేదిక, గ్రామ మ్యాప్‌లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల సేకరణ కేంద్రాలు తదితర వసతులపై సర్వే చేపడుతున్నారు. పల్లె ప్రగతి యాప్‌లోనే జీపీ ఇన్‌ఫ్రాక్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ అనే కొత్త ఆప్షన్ ఇవ్వగా వివరాలు అందులో పొందుపరుస్తున్నారు. 23 రకాల సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేసేలా యాప్‌ను సిద్ధం చేశారు.

పకడ్బందీగా సర్వే

-మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పల్లెల్లో పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తుండగా ఎంపీ వోలు, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేస్తున్నారు. గ్రామంలోని వివరా లను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

నేడు విజయదశమి

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయ దశమిని గురువారం ఘనంగా జరుపుకోనున్నారు. తొమ్మిది రోజులుగా దేవీ నవరాత్రులు వైభవంగా కొనసాగాయి. విజయ దశమి శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని కూడా పిలుస్తారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చిందని పలువురి వాదన. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతి దేవికి తరువాతి మూడు రోజులు లక్ష్మీదేవికి తర్వాత మూడు రోజులు సరస్వతీ దేవిని పూజిస్తారు. ఈ సందర్భంగా బొమ్మలకొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఆలయాల్లో అమ్మ వారికి ఒక్కోరోజు ఒక్కో అలంకరణ చేస్తారు. పదవ రోజు దసరాపండుగ విజయదశమి నాడు జరుపుకుంటారు.

ముందస్తు దసరా వేడుకలు

కోరుట్ల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయిలపూర్ గ్రామంలో బుధవారం దుర్గా భవాని మాత దీక్ష పరులు ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. గ్రామంలోని చత్రపతి శివాజీ మహారాజు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. విగ్రహం వద్ద ఆయుద పూజలను నిర్వహించి దసర వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా భవానీ మాత దీక్ష పరులు మాట్లడారు. హిందు సామ్రాజ్య స్థాపనకు చత్రపతి శివాజీ మహారాజు చేసిన పోరాటం గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమిషకవి నవీన్, అన్నెల సురేష్, లింగంపల్లి నవీన్, రాహుల్, శేఖర్, మదుసూదన్, రాజేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

చందుర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయ ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా శ్రీధర్‌బాబు యువసేన అధ్యక్షుడు భీమరాజు కనకరాజు అన్నారు. చందుర్తి మండలం రామన్నపేటలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో భాగంగా గెలుపొందిన విజేతలకు, రన్నర్‌గా నిలిచిన క్రీడాకారులకు బుధవారం బహుమతులను అందజేశారు. టోర్న మెంట్ నిర్వహణకు సహకరించిన భీమరాజు కనకరాజుకు స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రాయికల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని బుధవారం ఒకరికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సింగర్రావు పేటకు చెందిన జైనొద్దీన్‌కు ట్రాక్టర్ ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు.

పుణ్యతిథి వేడుకలకు సాయిబాబా ఆలయం ముస్తాబు

● రేపటి నుంచి వేడుకలు



సాయిబాబా ఆలయం

కోరుట్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల షిరిడీ సాయి బాబా దేవాలయంలో దసరా మరుసటి రోజు నిర్వహించే 107వ పుణ్యతిథి వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది. ప్రతీ సంవత్సరం ఎంతో రంగరంగ వైభవంగా నిర్వహించే వేడుకలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా ఈ సంవత్సరం వేల సంఖ్యలో భక్తులు హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం 107వ పుణ్యతిథి అన్నదాన మహాయజ్ఞ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పుణ్యతిథి రోజున ఉదయం 5 గంటల నుంచి కాగడ హారతి, 5:30 ఆలయ సంకీర్తన, 6:30 అభిషేకం, 8:30 పతాకారోహణ, గణపతిపూజ, 9:30 కలుషాభిషేకం, 10:30 విశ్వకర్మ యజ్ఞము, 11 గంటల నుండి మధ్యాహ్నం 3:00 వరకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి ఏర్పాట్లను చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతీ ఒక్కరికి బాబా దర్శనం కల్పించనున్నారు. భక్తులకు ప్రసాదం పులి హోర, లడ్డు తయారీలో సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. దేవాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం, పోలీసు బందోబస్తు నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించే విధంగా ఆలయ కమిటి సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన జువ్వాడి

పట్టణంలో సాయిబాబ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ జువ్వాడి కృష్ణారావు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 3న జరుగు పుణ్యతిథి వేడుకల ఏర్పాట్లను జువ్వాడి కృష్ణారావు, దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులు పరిశీలించారు. దేవాలయంలో జరగుతున్న పుణ్యతిథి వేడుకలలో నిర్వహించు కార్యక్రమాలను దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించు మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులకు ఇబ్బందులు కాకుండా చూసుకోవాలని సూచించారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చివరి సంవత్సరంలో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహించిన ఇన్‌స్టాంట్ పరీక్షల ఫలితాలను బుధవారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ విడుదల చేశారు. వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో చూసుకోవాలని సూచించారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



రాయికల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రాయికల్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



లండన్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జగిత్యాలరూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బతుకమ్మలను తీరొక్కపూలతో పేర్చి మహిళలలు బతుకమ్మ పాటలు పాడారు. దాండియా ఆటలు, డీజే సౌండ్‌ల మధ్య నృత్యాలు యవతులు నృత్యాల చేస్తూ బతుకమ్మలను నెత్తిన పెట్టకొని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం గ్రామ శివారులో గల చెరువులు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

●కోరుట్ల రూరల్: తెలంగాణ అసోసియేషన్ అఫ్ యూనైటెడ్ కింగ్ డం (టాక్) ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ. దసరా వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. లండన్ మహానగరంలో చేనేత బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవాసీ భారతీయ మహిళలు తెలంగాణ సంప్రదాయ దుస్తులు దరించి బతుకమ్మ వేడుకలను జరిపారు. బతుకమ్మ వేడుకలో స్థానిక హౌంస్లొనగర్ మేయర్ అమీ క్రాఫ్ట్, తెలంగాన రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ మాజీ చైర్మెన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు రత్నాకర్, శుష్మణ రెడ్డి, సురేష్, రాకేష్, సుప్రజ, సత్యపాల్, శ్రీకాంత్, ఆశోక్, నవీన్ రెడ్డి, మల్లారెడ్డి, గణేష్, పవిత్ర, స్వాతి, సత్యమూర్తి, వేంకట్ రెడ్డి, తస్యం, రవి పాల్గొన్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్ మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలను తీసుకువచ్చి బతుకమ్మలను అందంగా అలంకరించారు. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఒక్క చోట చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు వేస్తూ బతుకమ్మ ఆట ఆడారు. మరి కొన్ని చోట్ల డీజే పాటలకు స్టెప్పులు వేస్తూ మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపం లోని జలాశయాల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే జలాశయాల వద్ద ప్రత్యేకాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

●రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన మహిళలు గ్రామ కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఘనంగా ఆడారు. అనంతరం పట్టణ శివారులోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలకేంద్రంతో పాటు తుంగూర్ తదితర గ్రామాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎస్సై రాజు పోలీస్ సిబ్బందితో శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

●పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని వెంగళాయిపేట, రాములపల్లి , శాలపల్లి గ్రామాలలో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను గ్రామ కూడల్లలో పెట్టి ఆడి పాడి శోబాయాత్రగా చెరువులకు వెళ్లి నిమజ్జనం చేశారు.



పెగడపల్లిలో..



బీర్‌పూర్‌లో..

కన్నుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు



మేడిపల్లిలో దుర్గదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్



కోరుట్లలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ దేవాలయాలతో పాటు కులసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్న వరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణం లోని అయ్యప్ప జ్ఞాన సరస్వతి, కోటి నవదుర్గ, తిశక్తి, దుర్గాదేవి, బారతి సాయితి సమితి లతో పాటు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపాల వద్ద ప్రత్యేక పూజలు వేదపండితులు నిర్వహించారు. అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనం ఇచ్చింది. పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో స్వామి వారు ఆంజ నేయ వాహనంపై దర్శనం ఇవ్వగా అష్టలక్ష్మి దేవాలయంలో లక్ష్మి నరసింహా స్వామి పోన్నచెట్టు వాహనంపై దర్శనం ఇచ్చారు. పలు మండపాల వద్ద కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజున భక్తులు దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం గ్రామాల్లోని దుర్గా మండపాలలో భక్తులతో కిక్కిరిసాయి. చివరిరోజున అయినందున అమ్మ వారిని నాయకులతో పాటు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక అర్చనలు, పూజ కార్యక్రమాలు చేపట్టారు. జగ్గసాగర్ గ్రామంలో భక్తులు కుంకుమ పూజల కార్యక్రమాలు నిర్వహించారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలోని శ్రీ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చండీయాగంను ఘనంగా నిర్వహించారు. వేద పండితుడి మంత్రోచ్చరణల మధ్య జరిగిన యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సమితి సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు. అల్లీపూర్ హనుమాన్ దేవాయలంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాల్లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

● వెల్గటూర్: వెల్గటూర్‌లో దుర్గామాత శ్రీ సిద్ధిదాత్రి దేవి రూపంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికి పసుపురంగు చీరతో అలంకరించారు. మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. రాంనూరు, స్తంభంపల్లి, పాషిగామ, పైడిపల్లి, కిషన్ రావుపేట గ్రామాలలో. దుర్గామాతకు బవాని భక్తులు భక్తితో పూజలు చేశారు.

●మేడిపల్లి: శరన్నవరాత్రుల సందర్భంగా మేడిపల్లి, కట్లకుంట, పోరుమల్ల గ్రామాల్లో నెలకొల్పిన దుర్గ మాత అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏన్గు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, బొంగోనిరాజాగౌడ్, నాగరాజు, దామోదర్, బలగంరాజేష్, లాజర్, సాల్మాన్, నర్సయ్య, నర్సరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం మహర్నావమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాలతో పాటు దేవి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. మల్లాపూర్‌లో ఎస్సై రాజు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. మొగిలిపేట గ్రామానికి చెందిన ముస్లిం మహబూబ్‌ఖాన్ కుటుంబ సభ్యులు భవాని దీక్షపరులతో పాటు భక్తులకు అన్న ప్రసాదం పెట్టారు.

మహిషాసురదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

కొడిమ్యాల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి సన్నిదిలో నవరాత్రోత్సవాల్లో బాగంగా బుధవారం దుర్గాదేవి మహిషాసురదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హన్మాన్ సేవాసమితి సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కథలాపూర్ ఆర్ఐగా రవీందర్

కథలాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ పరిశీలకుడిగా రవీందర్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన నగేశ్‌ను కోరుట్ల ఆర్డీవో సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు.

ఎస్సారెస్పీ నుంచి 2.5లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 39 గేట్లు పైకి ఎత్తి 2,50,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 62.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 616 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.



రాజరాజేశ్వరి రూపంలో అమ్మవారు


అమ్మవారికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారలు రాజ రాజేశ్వరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, భరత్‌శర్మ, దుద్దిళ్ల నారాయణశర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వేళలో శ్రీ యోగా, ఉగ్ర నారసింహ స్వామి వారలను పొన్న చెట్టు సేవపై పుర వీధుల్లో ఊరేగించి రాత్రి వేళలో ఆలయానికి తీసుక వచ్చారు. నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. అమ్మవారలకు షోడషోపచార పూజతో హారతి, మంత్రపుష్పం, కన్యకా పూజ, ముత్తైదువల లలిత సహస్రనామ పారాయణంతో తీర్థప్రసాద వితరణ జరిపారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో, నేరెళ్లలో రుత్వికులు జన్మంచి వంశీకృష్ణ, నారంభట్ల ప్రశాంత్, కశొజ్జల బాలకృష్ణ, మదు నటరాజ్‌శర్మ, పెండ్యాల రాజేష్‌శర్మ, ఒజ్జల వికాస్, విలాస్ తదితరులు అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు

ధర్మపురి క్షేత్రంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన నవరాత్రోత్సవాల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాతను, స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయం పక్షాన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చండీ హోమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్





'వృద్ధుల పోషణ విస్మరిస్తే చర్యలు'

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వృద్ధుల పోషణను విస్మరిస్తే చట్ట ప్రకారం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలను స్థానిక సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12మంది నిరుపేదలకు వస్త్రాలతో పాటు దుప్పట్లు అందజేశారు. ఆయన తదనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురిని మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి ఆర్డీవోల సహకారంతో వృద్ధుల కేసుల సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే తిరిగి తల్లిదండ్రుల పేరిట మార్చే అధికారం కలెక్టర్‌కు ఉందని వయోవృద్ధుల చట్టం పై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వయోవృద్ధుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు హరిఅశోక్ కుమార్, విశ్వనాథం, ప్రకాష్‌రావు, హన్మంతరెడ్డి, యాకూ బ్, అశోక్‌రావు, సత్యనారాయణ, సఖి సెంటర్ అడ్మిన్ లావణ్య, ఫీల్డ్ ఆఫీసర్ కొండయ్య, కోరుట్ల, ధర్మపురి, గొల్లపల్లి, మెట్‌పల్లి బాధ్యులు శివానందం, గంగాధర్, వీరారెడ్డి, బుచ్చిరెడ్డి, దుర్గేశం, మహిళా బాధ్యులు జలజ, కరుణ తదితరులున్నారు.

మెడిసిన్‌లో సీటు సాధించిన జగిత్యాల విద్యార్థిని

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని సరిగళ్ల శ్రియ మెడిసిన్ సీటును సాధించింది. నవ్య బాలికల జూనియర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన సరిగళ్ల శ్రియ అనే విద్యార్థిని నీట్‌లో 398 మార్కులు సాధించింది.

బుధవారం విడుదల చేసిన నీట్ సీట్ల కేటాయింపులో రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌లో గల నోవా మెడికల్ కాలేజ్ కన్వీనర్ కోటాలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, గాలిపెల్లి ఈశ్వర్ కుమార్‌లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన శ్రియను, ప్రోత్సహించిన అధ్యాపకులను అభినందించారు.





